క్లుప్తంగా

అనారోగ్య కారణాలతో సెలవుపై ఎంపీపీ



మాచర్ల రూరల్: అనారోగ్య కారణాలతో పదవీ బాధ్యతలు నిర్వహించలేనంటూ ఎంపీపీ బూడిద మంగమ్మ సెలవు పత్రాన్ని అందజేశారు. బుధవారం గుంటూరు జెడ్పీ కార్యాలయంలో సీఈవో వసంతరాయుడుని కలిసి సెలవు పత్రాన్ని అందించారు. సీఈవో వసంతరాయుడు సెలవును ఆమోదిస్తూ ఉపాధ్యక్షురాలిగా ఉన్న పోతురెడ్డి సుజాతకోటిరెడ్డికి ఎంపీపీగా బాధ్యతలను అందజేస్తున్నామని, దీనికి సంబంధించిన ఉత్తర్వులు మూడు రోజుల్లో మండల పరిషత్ కార్యాలయానికి పంపనున్నట్లు చెప్పారు. ఈ నెల 28వ తేదీన మండల పరిషత్ అధ్యక్షులుగా పోతురెడ్డి సుజాతకోటిరెడ్డి బాధ్యతలను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి గ్రామ సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డిలు ఉన్నారు.

మాజీ డైరెక్టర్ కొండలు మృతి

దాచేపల్లి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ బయ్యి కొండలు పార్థివదేహానికి గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి బుధవారం నివాళులర్పించారు. గుండెపోటుకు గురైన కొండలు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే కాసు కొండలు పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి కూడా కొండలు మృతదేహానికి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. నివాళులర్పించిన వారిలో జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొప్పుల సాంబయ్య, పార్టీ మండల కన్వీనర్ కోట కృష్ణ, సర్పంచ్ జంగా సురేష్, ఎంపీటీసీ షేక్ ఆదాంసాహెబ్, మాజీ సర్పంచ్ సంకురాత్రి వీరయ్య తదితరులు ఉన్నారు.

పీర్ ఎడ్యుకేటర్స్ ఎన్నిక



రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆరోగ్య సబ్ సెంటర్ ఆధ్వర్యంలో పీర్ ఎడ్యుకేటర్స్ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికైన విద్యార్థులకు పీర్ ఎడ్యుకేటర్స్‌కు కోట్లు, టోపీలు పంపిణీ చేశారు. అలాగే విద్యార్థినీ విద్యార్థులకు ఫ్లోరోసిస్, స్క్రీనింగ్, టెస్ట్‌లు నిర్వహించారు. పాఠశాలలోని బాల బాలికలకు టీడీ టీకాలు వేశారు. పిల్లల్లో రక్త హీనత నివారణపై అవగాహన కల్పించారు. పోషక పదార్థాలు ఉన్న ఆకు కూరలను ఎక్కువగా తినాలన్నారు. మంచి స్పర్శ, చెడు స్పర్శలపై వివరించారు. మధ్యాహ్న భోజనం యొక్క ప్రాముఖ్యతను విపులీకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతరావు, ఎంఎల్‌హెచ్‌పీ రూన్సీరాణి, ఏఎస్‌ఎం రాజ్యలక్ష్మీ, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణాలు మంజూరు

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు వలేటి శివకృష్ణ

శావల్యాపురం: ఈ ఖరీఫ్ సీజనుల్లో అర్హత కల్గియున్న రైతులందరికీ సత్వరమే వ్యవసాయ రుణాలు మంజూరు చేస్తున్నట్లు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు వలేటి శివకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో మేనేజరు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ అనుబంధ రుణాలు రూ.12 కోట్లు ఇవ్వటానికి లక్ష్యంగా ఎంచుకున్నామన్నారు. క్రాప్ రుణాలు రూ. 45 పైసల వడ్డీ రేటు, బంగారు ఆభరణాలపై రూ.77 పైసల వడ్డీ రేటుకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు స్వయం సహాయక సంఘాల్లోని మహిళా గ్రూపులకు రూ.50 కోట్లు, వ్యవసాయ అనుబంధ రుణాలు రూ. 20 కోట్లు ఖాతాదారులకు రుణాలు రూపంలో అందజేశామన్నారు. రుణాలు సకాలంలో చెల్లించిన రైతులకు ప్రభుత్వ పరంగా వడ్డీరాయితీ వర్తిస్తుందన్నారు. రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని తీవ్రంగా పెరిగిన ట్రాఫిక్ సమస్య వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ ఆధ్వర్యంలో సీఐ శోభన్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఐ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ బాటసారులు నడిచి వెళ్లాలన్నా ట్రాఫిక్ సమస్యతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిపి తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకొని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, వందనం, మల్లికార్జునరావు, మార్కు, కోటేష్ పాల్గొన్నారు.

ఒప్పిచర్ల గ్రామంలో పర్యటించిన డీఎంహెచ్‌వో

- వాటర్ ట్యాంకుల పరిశీలన
- సురక్షిత నీటినే తాగాలని సూచన



పొట్టి శ్రీరాములు కాలనీలో వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో



పీహెచ్‌సీలో రోగులను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రవి

కారెంపూడి: డయేరియా ప్రబలిన మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి బుధవారం పర్యటించారు. పొట్టిశ్రీరాములు కాలనీలోని వాటర్ ట్యాంక్‌ను తర్వాత గ్రామంలోని అన్ని వాటర్ ట్యాంక్‌లను పరిశీలించారు. వాటర్ ట్యాంక్‌లను క్లోరినేషన్ చేయించాలని గ్రామ కార్యదర్శిని కోరారు. అలాగే పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని మురుగు కాల్వలను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ డయేరియా కలుషిత నీరు తాగడం వల్లే ఎక్కువగా వస్తుందన్నారు. పొలాలకు వెళ్లి కలుషితమైన నీరు తాగవద్దని కాచి చల్లార్చిన నీటినే తాగాలని ఇంటి దగ్గర నుంచే పొలాలకు తాగునీరు తీసుకువెళ్లాలని సూచించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపు నిర్వహణ తీరును పరిశీలించారు. రోజుకు ఎన్ని కేసులు వస్తున్నాయి.. వాటిలో డయేరియా ఎన్ని.. ఇతర అనారోగ్య సమస్యలతో ఎందరు వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. డోర్ టు డోర్ సర్వే చేసి దాని ప్రకారం అనారోగ్య సమస్యలు గుర్తించిన వారికి వైద్య సేవలందించాలని ఆదేశించారు. తర్వాత కారెంపూడి పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. బుధవారం రెండు డయేరియా కేసులు వచ్చాయని ఒక కేసును నరసరావుపేట జిల్లా హాస్పిటల్‌కు పంపామని మరో కేసుకు కారెంపూడి పీహెచ్‌సీలోనే వైద్య సేవలందిస్తున్నామని పీహెచ్‌సీ డాక్టర్ లక్ష్మీమౌనిక తెలిపారు.

రోడ్లు విస్తరించినా .. ట్రాఫిక్ అస్తవ్యస్తం

- సాయంత్రం వేళ మరింత ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పోలీసులు విధులు నిర్వహిస్తే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం



పిడుగురాళ్ల ఐలాండ్ సెంటర్‌లో నాలుగు రహదారుల్లో అస్తవ్యస్తంగా ఉన్న వాహనాలు

పిడుగురాళ్ల: పట్టణ ప్రజలకు ట్రాఫిక్ సమస్య రోజు రోజుకు పెరుగుతుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పిడుగురాళ్ల పట్టణంలోని రహదారులన్నీ వెడల్పు చేశారు. పోలీస్ యంత్రాంగం ప్రత్యేకంగా ట్రాఫిక్‌పై దృష్టి సారించి ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు. అయితే ఇప్పుడు రోడ్లు విస్తరించినప్పటికీ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ప్రయాణిస్తుండటంతో ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు.

+ సాయంత్రం అయితే పట్టణంలో ముఖ్యంగా ఐలాండ్ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య భారీ స్థాయిలో నెలకొంది. ఈ సెంటర్‌లో నాలుగు రోడ్ల కూడలి ఉండటంతో బ్రాహ్మణపల్లి వెళ్లే రహదారి, కొండమోడుకు వెళ్లే రహదారి, జానపాడు వైపు వెళ్లే రహదారి, మహాబజారుకు వెళ్లే దారి మొత్తం నాలుగు రోడ్లు ఐలాండ్ సెంటర్‌కు ముడిపడి ఉండటంతో ఇక్కడ తరచూ ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది. సాయంత్రం మాత్రమే ఎక్కువగా ఈ సమస్య ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి 9 గంటల వరకు పోలీసులు విధులు నిర్వహిస్తే ఈ సమస్య పరిష్కారం అవుతుంది. సంబంధిత అధికారులు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఉత్తమ పురస్కారం అందుకున్న ఎంపీడీవోకు సత్కారం



మాచర్ల రూరల్: ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలందించినందుకు పురస్కారం అందుకున్న ఎంపీడీవో కాసెట్టి సరోజనీదేవిని బుధవారం వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు ఆధ్వర్యంలో ఆమె కార్యాలయంలో సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఎప్పటికప్పుడు సిబ్బందితో కలిసి సక్రమంగా ప్రజలకు సేవలు అందించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మార్కాపురం నుంచి మాచర్లకు వచ్చి విధులు సక్రమంగా నిర్వహిస్తున్నానంటే అందుకు ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజల సహకారం ఎంతో ఉందన్నారు. పలువురు ఆర్యవైశ్యులు తనను సత్కరించి అభినందించటం మరింత ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ మాచర్ల వ్యవస్థాపక అధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, సెక్రటరీ పందిరి నరసింహారావు, కోశాధికారి చుండూరు సత్యనారాయణ, వాసవి వృద్ధాశ్రమ అధ్యక్షులు పోలిశెట్టి పిచ్చయ్య, గంగిశెట్టి రాధాకృష్ణ, పలువురు అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాలతో ఎన్నో ప్రయోజనాలు



పశు పోషకులకు గాలికుంటు వ్యాధి టీకాల ప్రయోజనాలను వివరిస్తున్న పశు వైద్యాధికారి

రెంటచింతల: గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువులకు వేయించడం వలన పశు పోషకులు ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని మండల పశు వైద్యాధికారి షేక్ బషీర్ అన్నారు. బుధవారం మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో చేపట్టిన జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో పశువులకు టీకాలు వేసి ఆయన మాట్లాడారు. గ్రామంలో నాలుగు నెలలకు పైబడిన 22 ఆవులకు, 68 గేదెలకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగిందన్నారు. ఈ గాలికుంటు వ్యాధి వలన పశువులలో పాల దిగుబడి గణనీయంగా తగ్గి, పునరుత్పత్తి సామర్థ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎద్దులలో పనిచేసే సామర్థ్యం తగ్గుతుందని దీంతో రైతులు ఎంతో నష్టపోతారన్నారు. వర్షాకాల సీజన్‌లో పశువులకు జ్వరం, మేత తినకపోవడం, వనుకు రావడం, పాలు తగ్గిపోవడం, పళ్లు కొరకడం, పెదవుల వాపు, చొంగకారడం, నోటిలో పుళ్లు ఏర్పడిన వెంటనే పాడి రైతులు పశు వైద్యాధికారిని సంప్రదించి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని సూచించారు. మండలంలోని గ్రామాలకు చెందిన పాడి రైతులు తప్పనిసరిగా పశువులకు ఈ టీకాలను వేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు తేలుకుట్ల బాబు, రమేష్‌నాయక్, భాస్కర్ నాయక్, సర్పంచ్ గొట్టం ప్రమీలాగురవారెడ్డి పాడి రైతులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాలను వేయించాలి

పిడుగురాళ్లరూరల్: పశు పోషకులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను వేయించాలని బ్రాహ్మణపల్లి పశుసంవర్ధక శాఖ వైద్యులు శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని కోనంకి గ్రామంలో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల నోరు, కాలిగిట్టల మధ్య పుండ్లు రావటం, జ్వరం ఉండటం గాలికుంటు వ్యాధి లక్షణాలు అన్నారు. ఈ వ్యాధి సోకిన పశువులలో పాల ఉత్పత్తి తగ్గుతుందన్నారు. అందుకే వ్యాధి వచ్చిన తర్వాత వైద్యం చేయించుకోవటం కంటే ముందుగానే నివారణ టీకాలు వేయించుకోవాలని సూచించారు. అనంతరం 450 గేదెలకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం



పిడుగురాళ్లరూరల్: విద్యార్థులు విద్యలో బాగా రాణించాలని, తాము ఎంచుకున్న లక్ష్యం కోసం పని చేయాలని ఎస్ఆర్ఐ దొండేటి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని జూలకల్లు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతి తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థాయిలో నిలిచిన విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే బాగా చదవాలని అప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. ఈ అవార్డులను వెంకటేశ్వరరెడ్డికి విద్యాబుద్ధులు నేర్పిన మంగిరెడ్డి, శ్రీరామమూర్తి పేర్ల మీద అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పట్టాభిరామయ్య, ఉపాధ్యాయులు, ఆంజనేయులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ పరిధిలో రెండు నూతన బస్సులు ప్రారంభం

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ లో రెండు నూతనంగా బస్సులను అందుబాటులోకి వచ్చాయి. ఈ నూతన బస్సులను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు జెండా ఊపి ప్రారంభించారు. వీటిలో ఒకటి మంగళగిరి ఎయిమ్స్ హాస్పటల్‌కు కేటాయించినట్లు వివరించారు. వినుకొండ ప్రాంత ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పనిచేయని సీసీ కెమెరాలు.. భయాందోళనలో ప్రజలు

- వరుస దొంగతనాలతో భయపడుతున్న గ్రామస్తులు
- మరమ్మతులకు గురయిన పలు గ్రామాల్లోని కెమెరాలు
- వాటి స్థానంలో నాణ్యమైనవి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



రెంటచింతల గ్రామంలోని ఓ ప్రధాన సెంటర్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల ప్రధాన సెంటర్లలో అప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లా రూరల్ ఎస్పీ అప్పలనాయుడు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామాలలో ఎప్పుడైన అవాంఛనీయ ఘటనలు జరిగిన వెంటనే ఈ సీసీ కెమెరాల ద్వారా నేరస్తులను గుర్తించడానికి గతంలో ఏర్పాటు చేశారు. అప్పుడు కొందరు దాతల సహాయ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కెమెరాల పనితీరుపై ఆయా గ్రామాల ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పలు గ్రామాలలో చోరీలు జరిగిన సమయంలో ఈ సీసీ కెమెరాలను పరిశీలించగా మరమ్మతులకు గురైనట్లు పోలీసులు సైతం గుర్తించినట్లు వారు గుర్తు చేస్తున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కూడా అదుపు చేయడానికి మండలంలోని రెంటచింతల, పాలువాయిగేటు, తుమ్మకోట, రెంటాల, పాలువాయి జంక్షన్ తదితర గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగింది. రెంటచింతల గ్రామంలో గతంలో బ్రహ్మయ్య బావి సెంటర్లోని ఓ నివాసంలో, ఉట్ల స్తంభాల సెంటర్లోని ఓ ఇంట్లో, ఎర్రబాలెంలోని ఓ ప్రైవేటు స్కూల్ టీచర్ నివాసంలో, బాలవికాస్ స్కూల్ సమీపంలో పాశం కోటిరెడ్డి ఇంట్లో, గ్రామ పంచాయతీ ఎదురుగా మున్నా రాధా నివాసంలో, తుమ్మకోట గ్రామంలో ఒక ఆలయంలో, పాలువాయి జంక్షన్ సమీపంలో చోరీలు జరిగినప్పుడు ఈ కెమెరాలు పనిచేయని పరిస్థితి నెలకొంది. దీంతో చోరీలకు పాల్పడిన వారిని గుర్తించలేక పోయారని పలువురు గుర్తు చేస్తున్నారు. ఇటీవల కాలంలో రెంటచింతలలో వరుసగా రేగుల మాన్యంలోని ఓ ఆలయంలో, రామాలయం సెంటర్లో ఓ మెడికల్ షాపులో, శివాలయంలో, ఓ చిల్లర దుకాణంలో, అభయాంజనేయస్వామి ఆలయంలో, గుండా రమేష్, ఏరువ ప్రతాప్‌రెడ్డి నివాసంలో చోరీలు జరగడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా గ్రామాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి మరమ్మతులకు గురైన వాటి స్థానంలో నాణ్యమైన కెమెరాలను ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

చైన్ అపహరించిన నిందితులను పట్టుకుంటాం

సీఐ పత్తిపాటి సురేష్

పెదకూరపాడు: వృద్ధురాలిని బంధించి చైన్ అపహరణకు పాల్పడిన నిందితులను పట్టుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నామని పెదకూరపాడు సీఐ పత్తిపాటి సురేష్ తెలిపారు. బుధవారం పెదకూరపాడులోని బాధితురాలు చుండు సీతమహాలక్ష్మీ గృహాన్ని సందర్శించి బాధితురాలు వద్ద నుంచి వివరాలు సేకరించారు. అనంతరం సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు. దొంగతనాలకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఘటనా స్థలి వద్ద పరిసరాలను పరిశీలించారు. వారి వెంట ఎస్ఐ బాలూనాయక్, సిబ్బంది ఉన్నారు.

దూర విద్య ద్వారా టెన్త్, ఇంటర్ చదువుకునే అవకాశం

సార్వత్రిక విద్యా పీఠం రాష్ట్ర కో ఆర్డినేటర్ అక్బర్‌అలీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అక్బర్ అలీ

కారెంపూడి: బడి బయట ఉన్న 14, 15 ఏళ్లు పైబడిన వారు పదవ తరగతి, ఇంటర్‌ను సార్వత్రిక విద్యా పీఠం అందించే దూర విద్య ద్వారా అభ్యసించే అవకాశం ఉందని దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సార్వత్రిక విద్యా పీఠం రాష్ట్ర కో ఆర్డినేటర్ షేక్ అక్బర్ అలీ పేర్కొన్నారు. స్థానిక బ్రహ్మానాయుడు జెడ్పీ హైస్కూల్లో ఉన్న సార్వత్రిక విద్యా పీఠం సెంటర్‌లో ఆయన ఈ మేరకు రూపొందించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. 14 ఏళ్లు నిండిన వారు దూర విద్య ద్వారా పదవ తరగతి, 15 ఏళ్లు నిండిన వారు ఇంటర్మీడియట్ కోర్సులను అభ్యసించే అవకాశాన్ని సార్వత్రిక విద్యాపీఠం కల్పిస్తోందని తెలిపారు. హెచ్‌ఎం అనంతశివ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ కాలనీలో వైద్య శిబిరం



మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ ప్రభావతి



వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది



జ్వరాల బారిన పడిన వారి వివరాలు సేకరిస్తున్న వీఆర్‌వో ప్రసాద్

సాక్షి ఎఫెక్ట్

పిడుగురాళ్ల: మంచం పట్టిన జగ్జీవన్‌రామ్ కాలనీ అనే శీర్షకన సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురించటంతో స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు స్పందించి తక్షణమే వైద్యాధికారులను జగ్జీవన్‌రామ్ కాలనీలో వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. దీంతో టీడీపీ, జనసేన నాయకుల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ కాలనీలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో సుమారు 50 మందికి పైగా వైద్య సేవలను అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అలాగే జానపాడు గ్రామ పంచాయతీ అధికారులు హాజరై బ్లీచింగ్ చల్లటంతో పాటు పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి కె.ప్రభావతి మాట్లాడుతూ కాలనీ శివారు ప్రాంతంలో ఉండటంతో దోమలు సంచరించే అవకాశం ఎక్కువగా ఉండటం వలన ఇక్కడ నివసించే వారు దోమ తెరలను వాడాలని, అలాగే సైడు కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, కాచి వడపోసిన నీటిని మాత్రమే తాగాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. అలాగే ఈ కాలనీ వాసులకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా నేరుగా పిడుగురాళ్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు హాజరై వైద్య సేవలు పొందవచ్చని అన్నారు. సాక్షికి కృతజ్ఞతలు తెలిపిన జగ్జీన్‌రామ్ కాలనీ వాసులు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమాదేవి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, జనసేన, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధుల బారిన పడకుండా ఉండాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంటువ్యాధులపై అవగాహన కార్యక్రమం

దాచేపల్లి : అంటువ్యాధుల బారిన పడకుండా ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా జోనల్ సూపర్‌వైజర్ ఎం.విశ్వేశ్వరరావు అన్నారు. హెచ్‌ఐవీ, లైంగికంగా సంక్రమించే అంటువ్యాధులపై నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ ఉమ్మడి గుంటూరు జిల్లాలో 100 గ్రామాల్లో పని చేస్తుందని, ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్‌ల ద్వారా పల్నాడు జిల్లా వ్యాప్తంగా 55 గ్రామాల్లో 8 వారాల పాటు హెచ్‌ఐవీ, టీబీ, సుఖవ్యాధులపై అవగాహన కల్పిస్తున్నామని ఆయన చెప్పారు. ఐఈసీ మెటీరియల్స్, కండోమ్స్ ఉచితంగా అందజేస్తున్నామని, హెచ్‌ఐవీ, సుఖవ్యాధుల నివారణకు తమ వంతు ప్రచార కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపించవద్దని, వారిని ఆదరించి అభిమానించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.జె.చంద్రశేఖర్, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, లింక్ వర్కర్స్ లీలావతి, సాగర్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్‌ను హతమార్చిన నిందితులను కఠినంగా శిక్షించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

వినుకొండ(నూజెండ్ల): కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనపై ప్రజా చైతన్య వేదిక, ఏఐసీసీటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి శివయ్యస్థూపం వరకు ర్యాలీ నిర్వహించి హత్యచేసిన మృగాలను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా కిసాన్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు తోట ఆంజనేయులు మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన శిక్షలు అమలు చేయాలని, అప్పుడు దేశంలోని మహిళలకు రక్షణ ఉంటుందని అన్నారు. ప్రభుత్వ డాక్టర్ అబ్దుల్ రజాక్, తిరుమల హాస్పిటల్, బాలాజీ హాస్పిటల్, మాధవరావు హాస్పిటల్ సిబ్బంది పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు విజయకుమార్, ఫిరోజ్, వెంకటేశ్వర్లు, దుర్గా ప్రసాద్, లింగాచారి, గోపి, ప్రసాద్, రవి, శిరీష, కోమలి, శేఖర్, సునీత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ పరీక్షలు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు

నాదెండ్ల: యడ్లపాడు మండలంలోని చెంఘీజ్‌ఖాన్ పేట గ్రామంలో గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో ఉచిత పశు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి నరసరావుపేట డీడీ డాక్టర్ రామారావు, ఏడీ డాక్టర్ నర్సింహులు, చిలకలూరిపేట ఏడీ శ్రీనివాసరావు, స్థానిక వైద్యాధికారులు డాక్టర్ రాధాకృష్ణ, రోజర్ బెన్ని, ఏడుకొండలు, దీప్తి, గ్రామ ఉపసర్పంచ్ ఆంజనేయులు పాల్గొన్నారు. గేదెలకు చూడి పరీక్షలు నిర్వహించి ఎదకు రాని యాభై పశువులు, 15 తిరగపార్లే పశువులను గుర్తించి ఉచితంగా మందులు, దూడలు, గేదెలకు నట్టల నివారణ మందులు వేశారు. గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామారావు మాట్లాడుతూ పశుపోషకులు గేదెలు ఈనిన తర్వాత 45 రోజుల నుంచి 90 రోజుల లోపే గేదె ఎదకు వచ్చేలా యాజమాన్య పద్ధతులు పాటించాలని, ప్రతి ఏడాది ఒక దూడ పొందవచ్చని తెలిపారు. ఇలా చేయకుంటే పాడి రైతు నష్టపోయే అవకాశం ఉందన్నారు. గేదెల్లో ఎద లక్షణాలు గుర్తించటం, సరైన సమయంలో చూడికట్టించటం తప్పనిసరిగా చేయాలన్నారు. పశుబీమా పథకంలో గురించి అవగాహన కల్పించారు.

జీవన నైపుణ్యాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న సిస్టర్ విన్నరసి

దొడ్లేరు(క్రోసూరు): అమరావతి గుడ్ షెపర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని దొడ్లేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవన నైపుణ్యాలపై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. సదస్సుకు సంస్థ కార్యకర్త లక్ష్మణ్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా బచ్‌పన్ బచావో స్టేట్ కోఆర్డినేటర్ తిరుపతిరావు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు జీవన నైపుణ్యాలు తప్పకుండా అవసరం అన్నారు. మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉంటే భవిష్యత్తు బావుంటుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ బలాలు బలహీనతలు తెలుసుకొని ముందుకు సాగాలన్నారు. గుడ్ షెపర్డ్ సంస్థ డైరెక్టర్ సిస్టర్ విన్నరసి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నిర్ణయం తీసుకునే అధికారం కలిగి ఉండాలన్నారు. జీవితంలో ఒక లక్ష్యాన్ని కలిగి ఉండాలని, కౌమార దశలో విద్యార్థులు అట్రాక్షన్‌కు గురై జీవితాలను పాడు చేసుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది బాబు పవన్ కుమార్, విద్యార్థినులు పాల్గొన్నారు.